క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలపడాలి



ముద్ర రుణాలను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మురమండ చేనేత సొసైటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 మందికి ముద్ర రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేలా సీఎం జగన్ వివిధ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ఆర్‌వీ నరసింహారావు, నోడల్ ఆఫీసర్ ఉమారాణి, ధనుంజయరావు, పెద్దిరాజు, చేనేత సొసైటీ అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, సహకార సొసైటీ అధ్యక్షుడు ఈదర దీనదయాళ్, స్థానిక నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మెల్లిమి మంగ పాల్గొన్నారు.

జేష్ణకు పలువురి అభినందన



ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించిన జేష్ణను అభినందిస్తున్న శ్యాంసుందర్

రాజమహేంద్రవరం రూరల్: పిల్లల్లోని క్రీడాశక్తిని తల్లిదండ్రులు గుర్తించి, ప్రోత్సహించాలని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్ అన్నారు. స్థానిక ఆల్కట్ గార్డెన్స్‌లోని సత్యసాయి గురుకులం మూడోతరగతి విద్యార్థిని వర్రి జేష్ణ ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి అండర్ – 9 విభాగం ఆర్చరీ పోటీల్లో మూడు రజత, ఒక కాంస్య పతకం సాధించింది. ఈ నేపథ్యంలో గురుకులంలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.గుర్రయ్య, బ్లాక్ ఇన్‌చార్జి పి.గౌరీ, శిక్షకుడు రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వైద్యసేవలు



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పట్టియ్య

కడియం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి కుటుంబానికి విస్తృత వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారని దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం శిబిరం ఏర్పాటు చేశారు. పలు రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గ్రేస్ ఆధ్వర్యంలో కేవీ లక్ష్మి, ఎం.నాగమణి, ఐశ్వర్య, బి.వినీత, ఏ.ముత్యాలు, ప్రమీల సేవలందించారు. ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కెనాల్ రోడ్డుపై దళితుల ఆందోళన



ఆందోళనకారులతో చర్చిస్తున్న తహసీల్దార్ సుజాత

కడియం: స్థానిక బొబ్బిలిబ్రిడ్జి సెంటర్‌లో వంతెన పక్కనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని డిమాండ్ చేస్తూ దళితులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. ఇక్కడ విగ్రహ ఏర్పాటుకు పంచాయతీ అనుమతులు ఉన్నాయని, అయినప్పటికీ సంబంధిత అధికారులు సహకరించడం లేదని ఆరోపించారు. విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించిన స్థలంలో ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కెనాల్ రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. ఆందోళనకారులతో కడియం తహసీల్దార్ ఎం.సుజాత, పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ చర్చించారు. కలెక్టర్ సమక్షంలో చర్చలకు వెళ్లేందుకు వారికి నచ్చజెప్పారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమించారు. కాగా.. కలెక్టర్ మాధవీలతతో జరిగిన చర్చల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు స్టాలిన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బడుగు ప్రశాంతకుమార్, పార్టీ నాయకులు బట్టు చిన్ని తదితరులు పాల్గొన్నారు. సమస్యను ఆమెకు వివరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత స్థలాన్ని స్వయంగా పరిశీలించి, నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

రచ్చబండలో మహిళలకు న్యాయం

- సొమ్ములు తిరిగిచ్చేస్తానన్న కాంట్రాక్టర్
- ఎంపీ భరత్ రామ్ చొరవతో సమస్య పరిష్కారం



రచ్చబండలో కాంట్రాక్టర్ క్రాంతికుమార్‌ను నిలదీస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: మహిళల నుంచి రూ.39.5 లక్షలు వసూలు చేసి, కనబడకుండా తిరుగుతున్న కాంట్రాక్టర్ ఎట్టకేలకు ఎంపీ భరత్ నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో తన తప్పు ఒప్పుకున్నాడు. తనను క్షమించాలని ఎంపీ భరత్‌రామ్, మహిళలను ప్రాధేయపడ్డాడు. వారం, పది రోజుల్లో అందరికీ సొమ్ములిచ్చేస్తానని మాట ఇచ్చాడు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం వెలుగుబందలో జగనన్న ఇళ్ల కోసం పేదలకు పట్టాలిచ్చారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు క్రాంతి కుమార్ అనే కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. వెలుగుబందలో కాలనీలో ఇళ్ల స్థలాలు తీసుకున్న వారిలో సుమారు వందమంది మహిళలు ఆ కాంట్రాక్టర్‌కు రూ.50 వేల నుంచి లక్షన్నర వరకూ, ఇద్దరు ముగ్గురైతే రూ.1.75 లక్షల వరకూ ముట్టచెప్పారు. ఇలా మొత్తం సుమారు రూ.39.5 లక్షలను ఆ కాంట్రాక్టర్ వసూలు చేశాడు. కానీ పనుల్లో మాత్రం వేగం పుంజుకోలేదు. ఒకటి, రెండు నెలల్లో ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పి, ఆ తర్వాత కనబడడం మానేశాడు. ఇదంతా జరిగి ఏడాదిన్నర అవుతోంది. అతడు ఒప్పుకున్న ఇళ్ల పునాదులు, గోతుల స్థాయిలో ఉన్నాయి. ఈ విషయమై బాధిత మహిళలు ఎంపీ భరత్ కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒకటి, రెండుసార్లు చెప్పానని, త్వరగా ఇళ్ళు కట్టేసి ఇస్తానని మాట ఇచ్చాడని, ఇంకా కట్టలేదా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్ కబురు పంపారు. దీంతో అక్కడకు చేరుకున్న కాంట్రాక్టర్‌ను చూసి బాధిత మహిళల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ భరత్ గట్టిగా హెచ్చరించే సరికీ కాంట్రాక్టర్ దారికి వచ్చాడు. వారం, పది రోజుల్లో సొమ్ములు తిరిగిచ్చేస్తానని హామీ ఇచ్చాడు. ఎంపీ భరత్‌రామ్ వెంటనే వన్ టౌన్ సీఐకు ఫోన్ చేసి సదరు కాంట్రాక్టర్ క్రాంతి కుమార్ పై ఫిర్యాదు చేశారు.

ఎంపీ భరత్ రామ్ అభినందనలు

బొమ్మూరు టిడ్కో గృహాలకు కిలోమీటరు దూరంలో క్రైస్తవులకు 4.85 ఎకరాలను శ్మశాన వాటికకు కేటాయించారు. తమ విజ్ఞప్తికి స్పందించి బరియల్ గ్రౌండ్‌కు స్థలం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సుమారు 150 క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు చెందిన పాస్టర్లు శుక్రవారం ఎంపీ కార్యాలయానికి వచ్చి ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ నిమిత్తం 4.85 ఎకరాలు, ఎస్సీల బరియల్ గ్రౌండ్ నిమిత్తం ఎకరా 5 సెంట్లు మంజూరు చేయించానన్నారు.

46వ డివిజన్‌లో గడప గడపకూ..

రాజమహేంద్రవరం సిటీ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం రామాలయం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులందరినీ పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలని, తక్షణమే పరిష్కరించే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, చోడిశెట్టి సత్యవాణి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- టీటీడీ చైర్మన్, అధికారులకు వినతి



టీటీడీ అధికారులను కలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు నియోజకవర్గంలోని పలు ఆలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, కల్యాణ మండపాల పునఃనిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుమల వెళ్లిన ఆయన ఈ మేరకు గతంలో చేసిన విజ్ఞాపనలను ప్రస్తావిస్తూ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ. ధర్మారెడ్డి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరెడ్డిని కలుసుకున్నారు. గత నవంబర్‌లో చేసిన ఈ ప్రతిపాదనలపై వారు కూడా సానుకూలంగానే స్పందించారన్నారు. అలాగే టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్స్ ఆస్పత్రి డైరెక్టర్ రెడ్డప్పరెడ్డిని కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలోకి రాని మోకాళ్ల కీళ్ల మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నియోజకవర్గం నుంచి ఇక్కడకు పంపించి, వైద్యం చేయిస్తుంటారు.

మే 4న కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సమావేశంలో పాల్గొన్న ప్రసాదాచార్య, బాలాజీ తదితరులు

సీటీఆర్‌ఐ: బూరుగుపూడిలో నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం మే 4న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తాళ్లూరు జీయర్ మఠాధిపతి పొడుగు వెంకట ప్రసాదాచార్య, శ్రీ శ్రీనివాసం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఏ.బాలాజీ వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బూరుగుపూడి సాయిబాబా ఆలయం దాటాక లోపలకు వెయ్యి గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, అందులో ఆలయ నిర్మాణం ఇప్పటికే 90 శాతం పైగా పూర్తి చేశామన్నారు. ఆలయ నిర్మాణం తదితర కార్యక్రమాలకు విరాళాలు అందించే దాతలు 94901 68555 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పంచముఖి ఆలయ నిర్మాణం ఫిబ్రవరి 3న ప్రారంభిస్తున్నామన్నారు. వెంకట ప్రసాదాచార్య స్వామీజీ మాట్లాడుతూ మే 4వ తేదీ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం నుంచి యాగశాల ప్రవేశంతో మొదలుపెట్టి 30న మండపారాధన, 108 దంపతులతో సామూహిక వ్రతాలు, అలాగే 4వ తేదీ వరకూ ఉదయం పూజలు, హోమాలు, సాయంత్రం ప్రవచనాలు ఉంటాయని వివరించారు.

జాతీయస్థాయికి గ్రీన్ ఏపీ ప్రాజెక్టు



కంబాలచెరువు: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా జిల్లా నుంచి గ్రీన్ ఏపీ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టును తయారు చేసిన విద్యార్థిని ముక్త నవ్యశ్రీని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తన కార్యాలయంలో అభినందించారు. ఈనెల 27 నుంచి అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొనడానికి ముక్త నవ్యశ్రీ వెళ్లనుంది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మన జిల్లా విద్యార్థిని తయారు చేసిన పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఏపీ విభాగం ఎంపిక కావడం హర్షణీయమన్నారు. విద్యార్థులలో ప్రతిభను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. గైడ్ టీచర్ సీతారామాంజనేయులును డీఈవో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జాతీయ బాలల సైన్స్ సమన్వయకర్త కస్తూరి సతీష్ బాబు, ఏఎంవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈనెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగుల సమ్మె సందర్భంగా యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు శుక్రవారం కెనరా బ్యాంక్ ఎదుట సన్నాహక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ యూనియన్ నాయకుడు లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఐదురోజుల పనిదినాలు, పెన్షన్ సవరణ, పాత పెన్షన్ విధానం అమలు, నూతన వేతన ఒప్పందంపై చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు చంద్ర శేఖర్, శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, రాజు, రమేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రకాశం నగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో దళిత, గిరిజన సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆనం కళాకేంద్రం పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి జిల్లాలోని దళిత, గిరిజన నాయకులు హాజరు కావాలని కోరారు.

తుపాకీ కేసులో మూడో వ్యక్తి అరెస్టు

కంబాలచెరువు: తుపాకీతో తిరుగుతున్న ఇద్దరిని జైలుకి పంపిన పోలీసులు.. శుక్రవారం మూడో వ్యక్తి బొత్స మోహన్‌ను అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం తుపాకీ చూపించి డబ్బులు గుంజేందుకు సిద్ధమైన కెల్లా సత్యనారాయణ, అంబళ్ల హరిసూర్యను పోలీసులు అరెస్టు చేసి జైలుకి పంపారు. అలాగే తుపాకీని ఒడిశా ప్రాంతం నుంచి తెచ్చేందుకు సహకరించిన కెల్లా సత్యనారాయణ బావ బొత్స మోహన్‌ను విజయనగరంలో అదుపులోకి తీసుకుని రాజమహేంద్రవరం తీసుకువచ్చారు. పోలీసులు అతనిని అరెస్టు చేసి జైలుకి తరలించారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కడియం: మండలంలోని బుర్రిలంకలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు కడియం పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.38,800, మూడు బైక్‌లు, ఆన్‌లైన్ డివైజ్‌లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

- అధికారులతో ఎంపీ భరత్ రామ్
- 10వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో ప్రజలు తెలియజేసిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆదేశించారు. స్థానిక 10వ డివిజన్‌లో మోరంపూడి పోలేరమ్మ గుడి నుంచి శుక్రవారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ అధికారులతో కలసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజలను సమస్యలపై ఆరా తీశారు. ఆ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. సీసీ రహదారిపై ప్యాచ్ వర్క్, పార్కు అభివృద్ధి పనులు, కాలువల్లో పూడిక తొలగింపు పనులను తక్షణమే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంకిన భవానీప్రియ, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



మహేష్ (ఫైల్)

ధవళేశ్వరం: మతిస్థిమితం సరిగ్గా లేని యువకుడు అదృశ్యమయ్యాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకొండ నేతాజీనగర్‌కు చెందిన శరకణం మహేష్ ఈ నెల 17వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అన్నిచోట్లా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం మహేష్ తండ్రి అప్పలరాజు ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఎస్సై వి.క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



తిరుమల విద్యాసంస్థల్లో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమోహనరెడ్డి, నున్న సురేష్


రాజమహేంద్రవరం రూరల్: బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రాజమహేంద్రవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ నాగమోహన్ రెడ్డి సూచించారు. జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీఎస్పీ కేవీఎస్ వరప్రసాద్ పర్యవేక్షణలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాతేరులోని తిరుమల విద్యాసంస్థలలో డ్రైవర్లు, క్లీనర్లకు రహదారి భద్రత, జీవన భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి బస్సులు నడుపరాదన్నారు. తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సురేష్, 200 మంది బస్సు డ్రైవర్లు,క్లీనర్లు పాల్గొన్నారు.

- హుకుంపేటలోని ఎస్‌టీ ప్లాంట్ రోడ్డులో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్, మినీగూడ్స్ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమోహన్‌రెడ్డి జాతీయ రహదారి భద్రతా, మన జీవన భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రం దుర్గా శ్రీనివాసరావు, మినీగూడ్స్ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డం శ్రీను, ట్రాఫిక్ ఎస్సై ఎండీ హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

రాజమహేంద్రవరం రూరల్: మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని జిల్లా రవాణా శాఖాధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు అన్నారు. హుకుంపేట ఎస్‌టీ ప్లాంట్ సమీపంలోని రాజమహేంద్రవరం లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. రవాణాశాఖాధికారి కృష్ణారావు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తులకు ప్రాథమిక వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, సుమ, శోక్ లేలాండ్ మేనేజర్ డాక్టర్ మాధురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలసీదారులకు మెరుగైన సేవలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జగన్నాథ్, శ్యామ్ సుందర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏజెంట్లందరూ నూతన టెక్నాలజీని వాడుకుని పాలసీదారులకు మెరుగైన సేవలు అందించాలని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) జోనల్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ ఎల్‌కే.శ్యామ్ సుందర్ కోరారు. రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో జీవిత బీమాసంస్థ సౌత్ సెంట్రల్ జోన్ (హైదరాబాద్) జోనల్ మేనేజర్ క్లబ్ ఏజెన్సీ కన్వెన్షన్ శుక్రవారం నిర్వహించారు. జోనల్ మేనేజర్ ఎం.జగన్నాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్యామ్ సుందర్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన జీవన్ ఆజాద్ (టి–868) పాలసీ గురించి తెలిపారు. కర్ణాటక మార్కెటింగ్ రీజినల్ మేనేజర్ పి.శ్రీధర్, ఏపీ, తెలంగాణ మార్కెటింగ్ రీజినల్ మేనేజర్ కె.మురళీధర్ మాట్లాడుతూ సంస్థలో ఉన్న అనేక పాలసీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ రాజమహేంద్రవరం డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావు, మార్కెటింగ్ మేనేజర్ బి.కల్యాణ్, సేల్స్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

సీటీఆర్‌ఐ: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక 44వ డివిజన్‌లో శుక్రవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాష్ట్రం పురోగతి సాధించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి సౌరయాగం

సీటీఆర్‌ఐ: సీతంపేటలో హోమశతచండీ సహిత **సౌరయాగం** నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు **వడలి కుమార్** శర్మ అన్నారు. ఆయన శుక్రవారం **యజ్ఞప్రాంగణం** వద్ద విలేకరులకు వివరాలు తెలి**పారు. ఈ** నెల 22వ తేదీ ఆదివారం నుంచి **ఫిబ్రవరి 26 వ**రకు ఏకధాటిగా 36 రోజుల పాటు **యాగం సంకల్పిం**చడానికి ఏర్పాట్లు చేశారన్నారు. **ప్రతిరోజూ ఉద**యం నుంచి సాయంత్రం వరకూ **హోమాలు త**దితర కార్యక్రమాలు ఉంటాయ**న్నారు. విశేష** కార్యక్రమాలకు సంబంధించి పం**చమి రోజు** రాజశ్యామల ఆరాధన, రథసప్తమి నాడు సూర్య జయంతి సందర్భంగా పంచాయృత అభిషేకాలు, మాఘపౌర్ణమి రోజు సామూహిక కుంకుమార్చనలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 11న పుత్రకామేష్టి సహిత సుబ్రహ్మణ్య హోమం, 18న మహాశివరాత్రి విశేష కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 26వ తేదీ ఆదివారం సూర్యకల్యాణం, మహాపూర్ణాహుతి అనంతరం భారీ అన్న సమారాధన చేస్తారన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో ఉద్యోగ సంఘాలు ముందుండాలని జిల్లా ఖజానాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నగర ఎన్జీవో సంఘ నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. నగర ఎంజీవో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు, కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి షఫియా, సహాధ్యక్షులు వేణుమాధవరావు, రాఘవరావు, ఖజానా ఉద్యోగుల సంఘం నాయకుడు సీహెచ్ విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం

కంబాలచెరువు: నల్సా స్కీంలో భాగంగా లైంగిక దాడికి గురైన బాధిత మహిళకు రూ.4 లక్షల పరిహారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సీఆర్పీసీ సెక్షన్ 357ఏ ప్రకారం నేరం వల్ల నష్టపోయిన వారికి లేదా మరణించిన వ్యక్తిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను ప్రవేశపెట్టాయన్నారు. సదరు కోర్టు ఇచ్చిన తీర్పు, న్యాయసేవాధికార సంస్థలకు చేసిన సిఫారసులను పరిగణించి న్యాయసేవాధికార సంస్థలు ఆయా కేసులను పరిశీలించి అర్హత కలిగిన బాధితులకు ఏపీ విక్టిమ్ కంపెన్సేషన్ స్కీమ్ 2015, నేరాలలో మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు పరిహారం పొందవచ్చన్నారు. 'నల్సా వారి బాధితుల పథకం 2018' ద్వారా లైంగిక దాడి లేదా ఇతర నేరాలకు గురైన మహిళా బాధితులకు పరిహారం అందజేస్తారన్నారు. కోర్టు బయట రాజీపడిన కేసులు, సహకరించిన బాధితులకు ఈ పథకాలు వర్తించవన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



ధవళేశ్వరంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

ధవళేశ్వరం: ధవళేశ్వరం నుంచి ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి వ్యాన్‌లో తరలిస్తున్న 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ధవళేశ్వరం రాఘవేంద్రస్వామి గుడి సమీపంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 32 సంచుల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. ఆ బియ్యం విలువ రూ.2,10,800 ఉంటుందని అధికారులు వెల్లడించారు. వాహనం డ్రైవర్ మాధురి హనుమంతు, యజమాని ఉండమట్ల వెంకట నాగేంద్ర, రేషన్ బియ్యం కలిగిన చాపా వెంకన్నపై కేసు నమోదు చేయాలని ధవళేశ్వరం పోలీసులకు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు పాల్గొన్నారు.

నర్సరీ రైతు ఆదినారాయణ కన్నుమూత



కడియం: కడియపులంకకు చెందిన నర్సరీ రైతు రావిపాటి ఆదినారాయణ (70) శుక్రవారం కన్నుమూశారు. గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నర్సరీలతో పాటు పూల వర్తక సంఘంలో కూడా ఆదినారాయణ సుపరిచితులు. కడియం ప్రాంత నర్సరీ రంగంతో ఆయనకు విస్తృత స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఆదినారాయణ మృతికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నర్సరీ రంగ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

కడియం: కడియపులంకలోని మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం రాత్రి పుష్పయాగం, పంచమంగళ హారతుల కార్యక్రమం వైభవంగా జరిగింది. సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా చంటియ్య, మహాలక్ష్మి దంపతులు, పెద సత్యనారాయణ, శ్రీదేవి దంపతులు ఈ పూజలు నిర్వహించారు. 108 రకాల పువ్వులు, ఒక్కో రకం 108 పువ్వుల చొప్పున ఈ పుష్పయాగంలో వినియోగించారు.